క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలకు చేయూత



సిమెంట్, స్టీల్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

తలకొండపల్లి: నిరుపేద ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూత నందిస్తున్నాడు. మండల పరిధిలో వెల్జాల్ గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఇటీవల నూతన ఇంటి నిర్మాణం చేపట్టింది. అయితే ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇంటి నిర్మాణం ఆగిపోయింది. సింగిల్‌విండో వైస్ చైర్మన్ కూన రవికుమార్ ద్వారా విషయం తెలుసుకున్న వెంకటేశ్, లక్ష్మీదేవి ఇంటి నిర్మాణానికి సిమెంట్, స్టీల్, ఇసుక, కాంక్రీట్ తదితర సామగ్రిని గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎండీ నసీర్, కృష్ణయ్యగౌడ్, మల్లేశ్, గోపాల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



లక్ష్మమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

కడ్తాల్: మండలంలోని మైసిగండి ఆలయ పూజారి యాదగిరిస్వామి మాతృమూర్తి లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. గురువారం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, లక్ష్మమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, సర్పంచ్‌లు లక్ష్మినర్సింహారెడ్డి, తులసీరాంనాయక్ తదితరులు ఉన్నారు.

గోలి శ్రీనివాస్‌రెడ్డికి సత్కారం



శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన గోలి శ్రీనివాస్‌రెడ్డిని గురువారం పలువురు సత్కరించి అభినందించారు. హైదరాబాద్‌లో శ్రీనివాస్‌రెడ్డిని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపీ మందా జగన్నాథ్, ఆమనగల్లు వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, భారతి సిమెంట్స్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ కొండల్‌రెడ్డి తదితరులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న రాములు

ఇబ్రహీంపట్నం రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన జోగు అంజయ్య కుటుంబానికి బీజేపీ పార్టీ ఆదిబట్ల మున్సిపాలిటీ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం చింతపల్లిగూడకు వెళ్లి బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ రాములు అందజేశారు. అలాగే శిగ వీరస్వామిగౌడ్ 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌గౌడ్, శివకుమార్, గణేశ్, శ్రీదేవి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మహేందర్‌కు సన్మానం



మహేందర్‌ను సన్మానిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కందుకూర్ మండలం బాచుపల్లి గ్రామానికి చెందిన మహేందర్ 'తెలంగాణ క్రాస్ బోలో' లో రెండో విజేతగా నిలిచాడు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత గురువారం మహేందర్‌ను సన్మానించి అభినందించారు. మరింత కష్టపడి దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జంగయ్య, నాయకులు.. నాగరత్నం, శ్రీకాంత్, కిషోర్‌కుమార్ తదితరులున్నారు.

మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు

బడంగ్‌పేట్: పట్నం మహేందర్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గురువారం బడంగ్‌పేటకు చెందిన బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రె కృష్ణ ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నవీన్ ఠాకూర్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అనుబంధాల రాఖీ

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనురాగానికి ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకల్ని ఆనందంగా జరుపుకున్నారు. తోబుట్టువులకు రాఖీలు కట్టడానికి ఆడపడుచులు తమ పుట్టింటికి తరలివచ్చారు. ఏ గ్రామంలో చూసినా రాఖీ పండగ సందడి నెలకొంది. ఏటా శ్రావణ పౌర్ణిమ రోజున రాఖీ పండుగ వేడుకను జరుపుకుంటారు. ఒకప్పుడు రాఖీ పండుగ ఉత్తరాదిన ఎక్కువగా జరుపుకునే వారు. క్రమేణా దేశంలోని అన్ని మారుమూల గ్రామాలకు విస్తరించింది. కులమతాలకతీతంగా అక్కాచెల్లెళ్లు తమ అన్నతమ్ముళ్లకు రాఖీలు కట్టి ప్రేమానురాగాలను చాటుకున్నారు. రాఖీలు కట్టిన సోదరిలకు సోదరులు కానుకలు అందించి దీవెనలు పొందారు.



కడ్తాల్: అన్మాస్‌పల్లి చెట్టుకు రాఖీ కడుతున్న సర్పంచ్ శంకర్



ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు రాఖీ కడుతున్న కుమార్తె జ్యోతి



జడ్పీటీసీ వెంకటేశ్‌కు రాఖీ కట్టిన ఎంపీపీ నిర్మల



తుర్కయంజాల్: డీసీసీబీ వైస్ చైర్మన్‌కు రాఖీ కడుతున్న మహిళ



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డికి రాఖీ కడుతున్న సోదరి విజయలక్ష్మి



యాచారంలో...



సోదరుడికి రాఖీ కడుతున్న అక్కాచెల్లి

రుణమాఫీపై స్పష్టత లేదు

యాచారం: కేసీఆర్ సర్కార్ రూ. లక్ష లోపు రైతులందరికి వ్యవసాయ పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించి రోజుల గడుస్తున్న నేటికి 70 శాతం మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని యాచారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ నాయిని సుదర్శన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రుణమాఫీ చేస్తారని ఆశతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు న్యాయం చేయాలి

యాచారం: తాడిపర్తి గ్రామంలోని సర్వే నంబరు 104లో ఉన్న 250 ఎకరాల భూదాన్ భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల అండదండలతో అక్రమణ దారులకే పరిహారం అందజేశారని అన్నారు. ప్రభుత్వం అక్రమార్కులకు ఇచ్చిన పరిహారాన్ని రికవరీ చేసి రైతులకు పరిహారంతో పాటు 121 గజాల ఇంటి స్థలాల పత్రాలను అందజేశాయని కోరారు.

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

తలకొండపల్లి: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్‌ను గెలుపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, పార్టీ గెలుపును ఎవ్వరూ ఆపలేరని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 80 నుంచి 86 సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ గెలుపుతోనే రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూలుపూర్ణిమ గాయత్రియజ్ఞం



గాయత్రియజ్ఞంలో పాల్గొన్న పద్మశాలీసంఘం నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ భక్తమార్కండేయస్వామి ఆలయంలో గురువారం నూలు పూర్ణిమ గాయత్రియజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో రాఖీ పౌర్ణమి వేడుకల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పద్మశాలీయులు గాయత్రిదారణ చేశారు. అనంతరం ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఉన్నత విద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, పద్మశాలీసంఘం అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు శివలింగం, సత్యరాములు, శ్రీనివాస్, రఘు, శివ పాల్గొన్నారు.

మండలం ప్రకటించేవరకు దీక్షలు

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దిష్టిబొమ్మ దహనం
- 60వ రోజుకు చేరుకున్న దీక్షలు



ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించే వరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకులు రేణురెడ్డి, డేవిడ్, చెన్నయ్యలు ప్రకటించారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్ష గురువారానికి 60వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ మండల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులు గట్టుఇప్పలపల్లికి ఉన్నాయని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు దీక్షలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము రేగుతోంది..

- వాహనాల రాకపోకలతో ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, స్థానికులు
- అనారోగ్యం బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు



సాగర్ రహదారిపై పేరుకుపోయిన దుమ్ము

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో రోడ్లు దుమ్ము రేగుతున్నాయి. వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రజలు వాపోతుంటే, దీనికి తోడు దుమ్ము, ధూళి వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. పేరుకే బీటీ, సీసీ రోడ్లు, అవి మట్టి రోడ్ల కంటే అధ్వానంగా మారాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాతావరణంలో నిర్ణీత స్థాయిలో ఉండాల్సిన దుమ్ము, ధూళి కణాల సంఖ్య సాధారణం కంటే మించిపోయింది. దీంతో రహదారులపై ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వసతుల కల్పనలో విఫలం

మున్సిపాలిటీలో 9 గ్రామాలతో పాటు 100కు పైగా కాలనీలు ఉన్నాయి. ప్రతి ఏటా కొత్త కాలనీలు విస్తరిస్తున్నాయి. ఇక్కడ నివసించే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. అందుకు తగ్గట్టుగా వసతుల కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మున్సిపాలిటీలో కేవలం 115 మంది మాత్రమే పారిశుద్ధ్య సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో నలుగురిని ఆఫీసులో అటెండర్లుగా, మిగతా కొందరిని హరితహారం, మల్టిపర్పస్ పనుల కోసం వినియోగిస్తున్నారు. మున్సిపాలిటీలో నివసించే జనాభా ఒకటిన్నర లక్ష వరకు ఉంటుందని అంచనా. చాలిచాలని సిబ్బందితో ప్రతి రోజు రోడ్లను శుభ్రం చేయించడం సాధ్యం కాదనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఉడ్చే యంత్రాలే లేవు

7 కిలోమీటర్ల మేర సాగర్ రహదారితో పాటు, సుమారు 600 కిలోమీటర్ల వరకు అంతర్గత రోడ్లను కలిగి ఉన్న మున్సిపాలిటీలో రోడ్లను ఉడ్చడానికి ఒక్క స్వీపింగ్ మిషన్ లేకపోవడం పాలకులు, అధికారుల నిర్లక్ష్యాన్ని రుజువు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో తుర్కయంజాల్‌కు అవార్డు దక్కింది. ఈ అవార్డు రావడంతో మంత్రి కేటీఆర్ రూ. 2 కోట్ల నిధులను ప్రోత్సాహకంగా అందించారు. ఈ నిధులతో స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పారు. కానీ రోజులు గడుస్తున్న హామీ నెరవేరలేదు. అధికారులు వెంటనే స్పందించి రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి దుమ్ము, ధూళి లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలో సమస్యను పరిష్కరిస్తాం



సాగర్ రహదారిపై రోడ్లకు ఇరువైపులా డివైడర్ లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు పెద్ద ఎత్తున బురద చేరుతుంది. దీంతో వర్షాలు ఆగిపోయాక దుమ్ము, ధూళి పెద్ద ఎత్తున వ్యాపిస్తున్న మాట వాస్తవమే. ఈ సమస్యను పరిష్కరించేందుకు త్వరలోనే స్వీపింగ్ మిషన్‌ను కొనుగోలు చేస్తాం. ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రం చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– సీహెచ్ శ్రీకాంత్, కమిషనర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ

క్రీడాకారుల సమస్యలపై పోరాటం



నియామకపత్రం అందుకుంటున్న నందునాయక్

హుడాకాంప్లెక్స్: ఎస్ఎస్ఎఫ్ స్టూడెంట్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆర్గనైజేషన్ మెంబర్‌గా నందునాయక్ నియమితులయ్యారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ డే హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా రాజేష్ అధ్యక్షతన ఎస్ఎస్ఎఫ్ స్టూడెంట్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్‌ను స్థాపించడం జరిగింది. గురువారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ పార్టీ స్పోక్స్‌పర్సన్ దాసోజు శ్రవణ్ హాజరై నందునాయక్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు అంటే భారతదేశానికి ఒక వెన్నుముక అని చాటి చెప్పడానికి, క్రీడాకారులకు అన్యాయం జరిగితే స్టూడెంట్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఉందని మనోధైర్యం నింపడానికి ఆర్గనైజేషన్ ప్రారంభించడం జరిగిందన్నారు. క్రీడాకారులకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నించేందుకు స్టూడెండ్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ పనిచేస్తుందని తెలిపారు. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన పెద్దలకు నందునాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



సుభద్రానగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

వనస్థలిపురం: ఉచిత వైద్య శిబిరాలను వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సుభద్రానగర్‌లో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో కాలనీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సొసైటీ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరగోపాల్, కాలనీ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పద్మజ, మదన్‌మోహన్ రావు, స్వర్ణలత, రాఘవరెడ్డి, నరసయ్య, హరినాథ్‌బాబు పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తత అవసరం



పశువు వైద్యశిబిరంలో డాక్టర్ స్రవంతి

షాబాద్: పశువులకు వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి పేర్కొన్నారు. గురువారం కుమ్మరిగూడ గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. పాడి పరిశ్రమతో జీవనం సాగించే రైతులకు మంచి ఆదాయం సమకూరుతుందన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణ టీకాలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు జంగయ్య, లక్ష్మయ్య, యాదిరెడ్డి, వైద్యసిబ్బంది సాగర్, శ్రీకాంత్, కృష్ణయ్య పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

మహేశ్వరం: మహేశ్వరం మండలం మన్సాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఐదు కులసంఘాల భవనాల నిర్మాణాలకు మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి శంకుస్థాపన చేయనున్నారని ఆ పార్టీ నేతలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతోపాటు గట్టుపల్లి గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో రూ.కోటి 26లక్షలతో చేపట్టనున్న నూతన హాల్, వసతి గృహంపై మొదటి అంతస్తు షెడ్డు, ప్రహరీ నిర్మాణం పనులకు శంకుస్థాపన, రూ.16 లక్షలతో మండల పరిషత్ పాఠశాలలో మన ఊరు మనబడి కింద పలు కార్యక్రమాలను ప్రారంభిస్తారు. పంచాయితీ భవనం వద్ద ఇండ్ల పట్టాల పంపిణీ, స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకల్లో మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్ పాల్గొంటారని నేతలు చెప్పారు.

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

హస్తినాపురం: 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి యువతీ, యువకుడు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న ఓటును తప్పకుండా వినియోగించుగించుకోవాలని హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కంచర్ల శివారెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీనర్సింహాపురం కాలనీ టీఎస్‌ఆర్ సులక్షణ అపార్ట్‌మెంట్‌లో కంచర్ల శివారెడ్డి ఆధ్వర్యంలో ఓటర్‌నమోదు కార్యక్రమం నిర్వహించారు.

టికెట్ రేస్‌లో నంది ఎల్లయ్య వారసుడు

చేవెళ్ల: రానున్న ఎన్నికల్లో చేవెళ్ల అసెంబ్లీ సీటుపై ఎంతో మంది ఆశావహులు ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ నుంచి చేవెళ్ల ఎమ్మెల్యే టికెట్ కావాలని మాజీ ఎంపీ స్వర్గీయ నంది ఎల్లయ్య వారసుడిగా ఆయన సోదరుడి కొడుకు నంది నరహరి కోరుతున్నారు. ఆయన ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆరు సార్లు ఎంపీగా, రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన నంది ఎల్లయ్య వారసుడిగా కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన సీనియర్‌గా తనకు కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే టికెట్ అవకాశం ఇవ్వా లని కోరినట్లు తెలిపారు. పార్టీ అధిష్ఠానం కూడా అవకాశం వచ్చినప్పుడు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పిందన్నారు. ఎస్సీ నియోజకవర్గమైన చేవెళ్ల నుంచి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిపారు.

గ్యాస్ ధర తగ్గించడంపై హర్షం



కడ్తాల్: ప్రధాని చిత్రపటానికి పూలాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

కడ్తాల్: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను తగ్గించినందుకు బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి గురువారం పూలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షాబంధన్ కానుకగా ప్రధాని వంట గ్యాస్ ధరలను తగ్గించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు భగీరథ, నాయకులు రమేశ్, యాదగిరి, సాయిలాల్ నాయక్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇబ్రహీంపట్నం రూరల్: రక్షాబంధన్ కానుకగా దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గ్యాస్ ధరలు తగ్గించారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాట్టి రాములు పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో బొంగ్లూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండర్‌పై రూ. 200 తగ్గించడంతో 33 కోట్ల కుటుంబాలకు ఊరట లభించిందన్నారు. దేశవ్యాప్తంగా 10 కోట్ల మంది ఉజ్వల లబ్ధిదారులకు రూ.400 భారం తగ్గిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు వీరస్వామి, ప్రభాకర్‌గౌడ్, శివకుమార్, గణేశ్, యాదయ్య, శ్రీనివాస్, పద్మ, వరలక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం అందజేత

షాద్‌నగర్: కంసాన్‌పల్లికి చెందిన గొడుగు సత్యనారాయణ కూతురు కృష్ణవేణి వివాహానికి మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్, సర్పంచ్ పద్మ దంపతులు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. పెళ్లి కానుకగా రూ.15వేల నగదు, పుస్తె, మెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరమ్మ, నర్సింలు, బాలవర్ధన్‌రెడ్డి, గొల్ల వెంకటయ్య, రవి, యాదయ్య, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్‌లో..



కొత్తూర్: ఆర్థిక సాయం అందిస్తున్న కౌన్సిలర్ హేమ

కొత్తూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో విద్యుత్ ప్రమాదంలో గాయపడిన బాధిత కుటుంబానికి కౌన్సిలర్ ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..విద్యుత్ ప్రమాదంలో గాయపడిన పవన్ కుటుంబ సభ్యులకు కౌన్సిలర్ హేమ రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధితుని కుమారుడికి ప్రస్తుత విద్యా సంవత్సరం స్కూల్ ఫీజు చెల్లించనున్నట్టు ఆమె తెలిపారు. వార్డులో విద్యుత్ వైర్ల సమస్యను త్వరగా పరిష్కరించాలని మున్సిపల్, విద్యుత్ అధికారులను ఈ సందర్భంగా ఆమె కోరినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ అన్న యువ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.